
# 25

మలయాళ మూలం : సేతు

తెలుగు సేత : ఎల్.ఆర్.స్వామి

# ఎండాకాలం



తలుపు తీసి మరోసారి బయటికి చూసింది ఆవిడ. బయట ఇంటి అరుగుమీద, వెలుతురు అంతగా పడనిచోట అలాగే ముడుచుకొని కూర్చునివున్నాడు ఆ యువకుడు. బక్కచిక్కిన ఒళ్ళు, జడకట్టిన జుట్టు, అంతగా పెరగని గడ్డం, బాగా నలిగి మాసిపోయిన షర్టు, దోతి– ఇది వాడి రూపం. స్నానంచేసి బట్టలు మార్చుకుని చాలారోజులై వుంటాయి. చెమట కంపు ఇంటిలోకి వస్తోందని అనిపించింది ఆవిడకి. ఎండుపుల్లలాంటి చేతి వేలుతో జుట్టు గోక్కుంటున్నాడు.

"నువ్వు ఇంకా ఇక్కడే వున్నావా?" లాంతరుతో అరుగుమీదకి వచ్చి అడిగారు ఆవిడ.

వాడు మాట్లాడలేదు, తిరిగి చూడనూలేదు. వేళ్ళమధ్య ఇరుకున్న పేనుని నులుపాడు. చీకటిలోకి ఉరిమి ఉరిమి చూస్తూ కూర్చున్నాడు.

"నీ పేరేంటీ? ఏ ఊరు?" ఆవిడ అడిగారు.

"ఇంటినుంచి పారిపోయి వచ్చావా?"

దానికీ జవాబు రాలేదు. వైశాఖ మాసపు ఎండకి మరిగిన చీకటి అక్కడక్కడ పడి చిక్కబడి వున్నది. వాడు అసహ్యంగా మూలుగుతూ ఊపిరి తీస్తున్నాడు; దగ్గుతున్నాడు. దగ్గుతున్నప్పుడు ఒళ్ళంతా కదులుతోంది. గొంతుకు అడ్డుపడిన కఫం తునకలు

తునకలుగా బయటపడుతోంది. "సరే... చిక్కబడే చీకటి చూస్తూ ఆవిడ అన్నారు. "నువ్వు ఇక్కడ ఇలా ముడుచుకొని కూర్చోటం కుదరదు. నాకు చెడ్డ పేరు. లే, వెళ్ళిపో. ఆయన త్వరలో సెలవుల్లో వస్తారు."

ఆ మాటలు పట్టించుకోలేదు వాడు. బుర్ర ఒకసారి కుదుపి ఒక బీడీముక్క తీసి నోటిలో పెట్టుకున్నాడు. అగ్గిపుల్ల గీస్తూవుంటే వాడి చేతివేళ్ళు వణికాయి. ఒక వెలుగు ఒక నిమిషం వెలిగి ఆరింది. ఆ వెలుగులో అతని కుడిబుగ్గపై ఒక పొడుగాటి మచ్చ వుండటం గమనించింది ఆవిడ. బయట కాల్దారి మీద నడిచేవాడొక్కడు ఇంటి గేటు దాటి వెళ్ళాడు.

"ఊరు వెళ్ళటానికి డబ్బులేకపోతే ఇస్తాను. వెంటనే వెళ్ళిపో. రాత్రి తొమ్మిదిన్నర కుంది చివరి బస్సు. వింటున్నావా... ఇంకోమాట... బీడీముక్క ఇక్కడ పడేయక. ఎవ్వరైనా చూస్తారు.."

ఆ మాటలు పట్టించుకోకుండా, ఆవిడ వైపు తిరిగాడు వాడు. ఒడకట్టినవాడి జుట్టు పెరిగి పొట్లకాయలలా వేలాడుతున్నాయి.

"లే, అక్కడ నుంచి..." ఆవిడ గట్టిగా అన్నారు." ఇంకా నువ్వు ఇక్కడ కూర్చోకూడదు. లేచి వెళ్ళిపో... కదలవేంటే... పక్కింటాయనని పిలవమంటావా? అతడు నాలుగు తంతే తెలుస్తుంది లే... ఇక ఎముకలు కూడా మిగలవు."

హఠాత్తుగా ముఖం పైకెత్తాడు వాడు. మసకమసక వెలుతురులో వాడి ముఖం పూర్తిగా స్పష్టంగా కనబడింది ఆవిడకి. లాంతరు పైకితెచ్చి మరోసారి జాగ్రత్తగా చూసింది. నిర్వికారంగా వుంది. ఎండిపోయిన వాడి ముఖం లోతులోకి జారిన అతని కళ్ళల్లో ఇరుక్కున్నాయి ఆవిడ కళ్ళు. వెంటనే తన ముఖంపై ఏదో పాకుతున్నట్టు అనిపించింది ఆవిడకి. హడావిడిగా పమిట సర్దుకుంది. చీరకొంగుతో ముఖం వత్తుకుంది. తలవంచి గొణిగారు ఆవిడ. "పోనీలే... చాలా రాత్రైపోయింది కదా...? కావాలంటే అరుగు మీద పడుకో, తెల్లవారక ముందే లేచి వెళ్ళిపోవాలి, తెలుసా... ఎవ్వరైనా అడిగితే నేను నిన్ను చూడలేదని అంటాను."

వాడు బుర్రతిప్పి చీకటిని ఉరిమి ఉరిమి చూస్తూ కూర్చున్నాడు. గట్టిగా పొగ పీలుస్తూ వుంటే వాడి దవడలు కుదించుకుపోతున్నాయి. పొగవలయాలు విడిచి పెడుతున్నప్పుడు వాడి పెదవులు వణుకుతున్నాయి.

కాసేపు వాడ్నిచూస్తూ నిలబడ్డారు ఆవిడ. ఇంటిలోపల పిల్లలు గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. వైశాఖ మాసపు గాలిలో మామిడిపండ్లు సుగంధం ప్రహరిగా అమర్చిన ముళ్ళకంచెపై చెదిరి ఎగిరే మిణుగురు పురుగులు-పెరటి నుంచి ఒక ఊరకుక్క దీర్ఘంగా ఏడ్చింది. హఠాత్తుగా ఏదో గుర్తుకువచ్చింది ఆవిడకి.

"ఆకలిగా వుంటే పెరటిలోకిరా. "ఆవిడ అన్నారు." అన్నంగిన్నెలో మెతుకులు మిగిలి వుండవచ్చు." ఒక నిమిషం మౌనంగా వున్నారు ఆవిడ. ఆ తరువాత అన్నారు." ఎవ్వరైనా చూస్తే పిచ్చివాడని చెబుతానులే."

బీడీముక్క తీసి పారేసాడు వాడు. ముఖం మోకాళ్ళ మధ్య పెట్టుకుని కూర్చున్నాడు.

"ఒద్దులే, పెరటిలోకి ఒద్దు. అక్కడ కూర్చుంటే ఎవ్వరైనా చూస్తారేమో... ప్రతినెల ఆయన పంపే 'మనియార్డర్' వస్తోంది కదా. అందువల్ల ఊరివాళ్ళకి అసూయ. లోపలికి వచ్చేయే అన్నం తినగానే వెళ్ళిపోవాలి, అంతే. ఏ రావిచెట్టు క్రిందనైనా వెళ్ళి పడుకో."

వాడు బుర్రతిప్పి మరోసారి ఆవిడని ఉరిమి చూశాడు. ఆవిడని అనుమానంతో చూస్తూ ఊగుతూ ఊగుతూ లేచాడు. దోతి దులిపి కట్టుకొని ఒకసారి గాండ్రించి ఉమ్మాడు. లాంతర్ పైకిలేపి మళ్ళీ వాడిని చూశారు ఆవిడ. ఎండిన వాడి ముఖంపై ఏ భావమూ లేదు షర్టు చెమటకి తడిసి వాడి ఒంటికి అంటుకొని వుంది. భుజంమీద ఒక గుడ్డ సంచి వేలాడుతోంది. "ఈ కాలం పిల్లల గురించి ఏం చెప్పగలం?" ఆవిడ అనుకున్నారు." ఆకలిగా వుంటే చెప్పవచ్చుగా".

ఒక నిమిషం అలాగే నిలబడ్డారు ఆవిడ. ఆ తరువాత ఇంటిలోపలికి అడుగులు వేశారు. వంటగదిలోకి అడుగులు వేస్తూ తిరిగి చూశారు. అప్పుడు వాడు గోడమీద వున్న ఒక ఫొటోని తదేకంగా చూస్తూ నిలబడి వున్నాడు! "ఆయనే మా ఆయన" ఆవిడ అన్నారు." పెళ్ళైన కొత్తలో తీయించుకున్న ఫొటో అది. ఇప్పుడు అలా ఏం వుండరు. జుట్టు మొత్తం నెరిసిపోయింది."

వాడి దృష్టి మెల్ల మెల్లగా ఫొటోనుంచి జారి గోడమీద వున్న సాలిగూడులపై పాకింది.

"రా, చాలా రాత్రైంది. వచ్చి తిని వెళ్ళిపో. నాకు నిద్రవస్తోంది. కాళ్ళు ఈడ్చుకుంటూ ముందుకు కదిలాడు వాడు. నల్లని నేలపై ముడుచుకొని కూర్చున్నాడు. గిన్నెలో మిగిలిన అన్నమంతా ఒక ప్లేటులో పోసి, ప్లేటు వాడిముందు వుంచారు ఆవిడ.

"కూరకాని, పచ్చడి కాని లేదు." వంటగది తలుపుకు జారి నిలబడి అన్నారావిడ. "మజ్జిగ వుంటుందేమో... కావాలంటే ఒక శీమ మిరపకాయ కూడా ఇస్తాను. చాలా...?"

వాడు ప్లేటులోకి వంగి కూర్చుని వున్నాడు. అన్నం మీద, తన ఎండుపుల్లల లాంటి చేతివేళ్ళమీద, మారిమారి చూశాడు. ఆ తరువాత ముఖం పైకెత్తాడు. వాడి పదునైన దృష్టికి తట్టుకోలేక ఆవిడ ముఖం తిప్పుకున్నారు.

"ఆయనకు 'మజ్జిగ మిరపకాయ వుంటే ఇంకేం అక్కరలేదు." తెలియకుండానే ఆవిడ గొంతు వణికింది. ఎండిన పెదవులను నాలికతో తడిపి చీరకొంగుతో ముఖం వత్తుకుంటూ అంది. "ఏం వేడి...ఏం వేడి... ఈ ఏడాది శివరాత్రికి కూడా వానపడలేదు... ఆయనకి సెలవు దొరకటం చాలా కష్టంగా వుందట. ఎలాగైనా వచ్చేనెలలో వస్తారట."

ఆ తరువాత చెప్పడానికి ఏదీ లేదన్నట్టు కిటికీలో నుంచి బయటకి చూస్తూ నిలబడ్డారు. చీరకొంగుతో విసురుకున్నారు.

వాడు అలాగే కూర్చున్నాడు.

ప్రహరీగా వేసిన ముళ్ళకంచె నుంచి రెండు పిల్లులు అరుస్తూ వాకిటిలోకి దూకాయి. కిటికీ వద్దకి వెళ్ళి చూశారు ఆవిడ. పిల్లులు అరుచుకుంటూ ఒక దాన్నొకటి కరుచుకుంటూ తులసికోట వెనుక మాయమయ్యాయి.

వైశాఖమాసపు వేడి మరుగుతోంది. కిటికీని ఆనుకొని నిలబడ్డారు ఆవిడ. నీరసంగా కనబడిన వాడిచూపు ఆవిడ ముఖం మీద పాకి ప్లేటు మీదకి వెళ్ళింది. మళ్ళీ పైకి వచ్చింది. వాడి పదునైన చూపుకి తన పమిట కదులుతున్నట్టు తోచింది ఆవిడకి. పాదాల వేళ్ళ కొసలో పుట్టిన ఒళ్ళంతా పాకుతున్నట్టు లోలోపల ఏవేవో మరిగి కరుగుతున్నట్లు. ఎండకి పెదవులు తడిచేసుకొని కాసేపు అలాగే నిలబడ్డారు ఆవిడ.

"అసలు తినలేదే. ఆకలిగా లేదా?" కాసేపు పోయాక అన్నం తినకుండా కూర్చునే వాడ్ని అడిగింది.

"నీకేం కావాలి?" తన జీరబోయిన గొంతు విని ఆవిడ ఉలిక్కిపడింది.

వాడు హఠాత్తుగా కదిలాడు. ఒక చెయ్యి నేలకి ఆన్చి లేచాడు. మరోసారి ఆవిడని ఉరిమి చూసి, సంచి భుజంమీద తగిలించుకుని, కాళ్ళు ఈడ్చుకుని ముందుకుసాగాడు.

ఇంటిగుమ్మం దాటి గేటువైపు నడిచేటప్పుడు గాండ్రించి ఉమ్మాడు. ఆ తరువాత తడబడే అడుగులతో ముందుకు సాగాడు.

బక్కచిక్కిన ఆ శరీరం చీకటిలో కరగటం చూస్తూ నిలబడ్డారు ఆవిడ.

వాడు గేటు దాటి వుండవచ్చు. గేటు అవతల కాల్దారిపై ఎవ్వరో టార్చ్‌తో నడిచి రావడం చూసి కంగారుపడ్డారు. వాడు ఇంటి నుంచి దిగి వెళ్ళటం అతడు చూసి వుంటాడా...?